ఈరోజు మోదాని పుస్తకావిష్కరణ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము - జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి.

**తేది : 03 మార్చి, 2023.**

**అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి**

**పోర్టులు ప్రభుత్వ పరం చేయాలి**

**మోదాని పుస్తకావిష్కరణలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

**ఓటర్లను బెదిరిస్తున్న ధర్మానపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి**

**14 నుండి 22 వరకూ అదానీ అక్రమాలపై ప్రచార క్యాంపెయిన్**

**9 నుండి 10 తేదీల్లో ఉద్యోగులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్త కార్యాచరణ**

అంతర్జాతీయ ఆర్థిక నేరగాడైన అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, ఆయనకు అప్పగించిన గంగవరం పోర్టుతోపాటు అదానీకి అప్పగించిన పోర్టులు, భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. అదానీ అక్రమాలపై ఈ నెల 14వ తేదీ నుండి 22 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార క్యాంపెయిన్ నిర్వహిస్తామని ప్రకటించారు. మోడీ, అదానీ అక్రమాలపై సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన మోదానీ పుస్తకాన్ని శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, రమాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రోద్భలంతో అదానీ దేశ సంపదను లూటీ చేశారని, అనతి కాలంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సంపన్నుడిగా ఎదిగాడని తెలిపారు. తీవ్ర అవినీతి, అక్రమాలతో అతి తక్కువ కాలంలో ఎదిగిన అతనిపై ఓ కంపెనీ ఇచ్చిన నివేదికతో అథమస్థాయికి దిగజారిపోయాడని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలు చేయడంలో అదానీ మొదటిస్థానంలో ఉన్నాడని అన్నారు. కేంద్రంలో మోడీతోపాటు రాష్ట్రంలో జగన్ కూడా సహకరించారని, ప్రభుత్వ ఆస్తిగా ఉన్న గంగవరం పోర్టు వాటాలను కూడా కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. అదీ చాలదన్నట్లు కృష్ణపట్నం పోర్టు, సోలార్ ప్రాజెక్టులు, విమానాశ్రయాలు, విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో వేల ఎకరాలు అదానీకి అప్పగిస్తున్నారని తెలిపారు. గంగవరం పోర్టులో ఉన్న 16 శాతం వాటాను ఒక్కోషేరు రూ.120కి కట్టబెట్టారని పేర్కొన్నారు. అలాగే విశాఖ పోర్టు నుండి ఎగుమతి, దిగుమతులు అయ్యే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యకలాపాలను బలవంతంగా గంగవరం పోర్టు నుండి చేయిస్తున్నారని తెలిపారు. వాటాలు అమ్మడంతోపాటు అతనికి వ్యాపారమూ చేసి పెడుతున్నారని , దీన్ని అడ్డుకోవాలని అన్నారు. గంగవరం పోర్టు భద్రతాపరంగానూ కీలకమైందని, ఇక్కడ అదానీ కార్యకలాపాల వల్ల దేశ భద్రతకూ ముప్పు వస్తుందని వివరించారు. ఇప్పటికే ముంద్రా పోర్టులో పెద్దఎత్తున డ్రగ్స్‌తో సహా వేలకోట్ల అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. 2019 నుండి పన్నులు కూడా కట్టలేదని, హిండెన్‌బర్గ్ నివేదికతో దిమ్మతిరిగి ఇప్పుడు కడుతున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు కూడా విచారణకు కమిటీ వేసిందని తెలిపారు. అలాగే అదానీ విద్యుత్ ప్రాజెక్టుల నుండి యూనిట్ విద్యుత్‌ను 2.49 పైసలకు కొనుగోలు చేస్తున్నారని, ఇప్పుడు మరో రూ.0.17 పైసలు పెంచాలని డిమాండు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని హెచ్చరించారు. అదానీకి వేలకోట్ల విలువైన భూములు కేటాయించిన ప్రభుత్వం అక్కడ రైతులకు మాత్రం తక్కువ మొత్తాన్ని ఇస్తూ, దోచుకునే అదానీకి మాత్రం వేలకోట్లు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అదానీకి రాష్ట్రంలో పెద్దఎత్తున ఎందుకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నారో ముఖ్యమంత్రి జగన్ కూడా వివరణ ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

విశాఖలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సు బోగస్ అని అన్నారు. రాష్ట్రం విడిపోయినప్పటి నుండి ఎన్ని కంపెనీలు తెచ్చారు, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు అనే అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసం చేయడానికి, ప్రలోభాలకు గురిచేసేందుకు ఇటువంటి తంతు చేస్తున్నారని మండిపడ్డారు. రకరకాల ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రంలో టూరిజం ప్రాజెక్టులు చేపడుతారని, ఇప్పటికే మిగిలిపోయిన పార్కులు, చెరువులు, భూములను ఆ పేరుతో కట్టబెడతారని తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో భూములను అక్కడ గ్రామసభలు ఏర్పాటు చేయకుండా, గిరిజనుల అభిప్రాయాలు తీసుకోకుండా కంపెనీలకు కట్టబెట్టేస్తున్నారని అన్నారు. విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు వేలకోట్ల విలువైన 400 ఎకరాలు కట్టబెట్టారని, ఇంతవరకు అతీగతి లేదని పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ, జగన్ కలిసి అదానీకి ఆస్తులు కట్టబెడుతున్నారని తెలిపారు. గ్యాస్ ధరలు పెంచారని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపుతున్నారని వివరించారు. ఏప్రిల్‌లో యూనిట్‌కు రూ. 0.19 పైసల నుండి రూ. 0.66 పైసలు పెంచేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు.

**ధర్మానపై చర్యలు తీసుకోవాలి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ వైసిపికి ఓట్లు వేయకపోతే తమకు తెలుస్తుందని, వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి ధర్మాన ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులను బెదిరించడంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. సొంతపార్టీ సర్పంచులను బెదిరించడం సిగ్గుచేటన్నారు. గుంటూరు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కూడా కెజిబివి పాఠశాలలకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులపై బెదిరింపులకు దిగుతున్నారని ఆమెపైనా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో తాను ఎన్నికైన ఆరునెలల కాలంలో సర్వీసు కండీషన్లు మారుస్తానని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు.

**ఉద్యోగులకు మద్దతుగా 9, 10 తేదీల్లో దీక్షలు**

సిపిఎస్‌పై ఉద్యోగుల ఆందోళన న్యాయమైందని వారికి మద్దతుగా ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు, ధర్నాలు చేపడతామని ప్రకటించారు. ప్రజలు కూడా ఈ సమస్యపై ఆందోళన చేస్తున్న వారికి సహకరించాలని కోరారు.